తూర్పు గోదావరి జిల్లా, కాకినాడలో ప్రస్తుతం పి. ఆర్. ప్రభుత్వ కళాశాల ఒకప్పుడు పి. ఆర్. కళాశాల.

ప్రభుత్వ కళాశాల కాదు.

వేమూరి రామకృష్ణారావుగారు ప్రిన్సిపల్.

అది నిజంగా పుణ్యకాలం. కాలేజి ప్రిన్సిపల్ అంటే జిల్లా కలెక్టర్ కన్న గొప్ప.




రామకృష్ణారావుగారు క్రమశిక్షణకు ఇచ్చినంత ప్రాధాన్యం మరి దేనికీ ఇవ్వ లేదు.

పి. ఆర్. కళాశాల ఆవరణలో కళాశాలకు అనుబంధంగా హైస్కూలు కూడా ఉంది.

స్కూలు పెద్దది. కాలేజి పెద్దది.

ఎంత పెద్దదైనా, ఎంతమంది విద్యార్థులు ఉన్నా అవి పనిచేసే వేళల్లో ఆవరణ మంతా నిశ్శబ్దంగా ఉండేది.

పనిచేసే వేళల్లో రామకృష్ణారావుగారు చేతిబెత్తం ధరించి ఆవరణమంతా తిరుగుతూ అజమాయిషీ చేస్తూ ఉండేవారు.

రామకృష్ణారావుగారు విశిష్టమైన వ్యక్తిత్వం కలవారు.

నాలుగు చక్రాల గుర్రపు బగ్గీలో— 'సార్ట్' అనేవారు దాన్ని ఆరోజుల్లో— ఇంటి నుంచి కాలేజికి రాకపోకలు సాగించేవారు.

రామకృష్ణారావుగారికి ఒక కన్ను కని పించదు! ఆయన కోచ్ నడిపేవాడికి ఒక కన్ను లేదు !! ఆ కోచ్ లాగే గుర్రానికి ఒక కన్ను లేదు !!

కాలేజి. స్కూలు పనిచేసే వేళల్లో వరాండాలలో ఎవరూ తిరగరాదని రామ కృష్ణారావుగారి శాసనం.




ఒకరోజు వరాండాలో స్తంభం అనుకొని ఒకరు నిలబడి ఉన్నారు. రామకృష్ణారావు గారు రావడం ఆ వ్యక్తి గమనించలేదు.

దురదృష్టవశాత్తు రామకృష్ణారావుగారి రెండవ కన్ను కూడా కొంచెం మసకగా మాత్రమే కనుపించేది.

"ఎన్నిసార్లు చెప్పారా వరాండాలో తిరగవద్దని?" అంటూ రామకృష్ణారావుగారు బెత్తంతో ఆ వ్యక్తిని ఒక్క దెబ్బకొట్టారు.

ఆ తరవాత - "ఎవర్రా నువ్వు?" అని అడిగారు.

"నేనండి. మాస్టారూ" అన్నాడా వ్యక్తి. ఆయన రామకృష్ణారావుగారి దగ్గర చదువు కొని. పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి. కాలేజీకి అనుబంధంగా ఉన్న హైస్కూలులో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు: రామకృష్ణారావుగారి ప్రియశిష్యుడు. అయినా సరే—సారీ అనలేదు రామకృష్ణారావుగారు.

"మాస్టారు నన్ను కొట్టాడు" అని ఆనందంతో. సగర్వంగా చెప్పుకున్నది ఆ శిష్యుడే.